

గురుకుల ఎంట్రెన్స్‌కు 8,034 మంది హాజరు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాసంస్థల్లో 5వ తరగతితో పాటు 6-9వ తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీచేసేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 23 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగిన పరీక్షకు 8,034 మంది విద్యార్థులు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్నవారిలో 190 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా ఎంట్రెన్స్ టెస్ట్ ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయ ఖాళీలు 625

- నియామకాలు జరిగినా వెక్కిరిస్తున్న ఖాళీలు
- వార్షిక పరీక్షల వేళ బోధనపై ప్రభావం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు ఉపాధ్యాయ నియామకాలు చేపడుతున్నప్పటికీ టీచర్ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీకి నోచుకోవడం లేదు. ప్రతీ నెలా కొందరు ఉపాధ్యాయులు రిటైర్మెంట్ అవుతున్న తరుణంలో ఏటా ఖాళీలు పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో 2024 డీఎస్సీ ద్వారా కొత్త నియామకాలు జరిగినా పోస్టుల భర్తీపై పెద్దగా ప్రభావం కనిపించడం లేదు. ఫలితంగా సంగారెడ్డి జిల్లాలో పలు పాఠశాలల్లో విద్యా బోధనపై ప్రభావం పడుతున్నది.

పోస్టు	మంజూరు	పనిచేస్తున్నవారు	ఖాళీలు
హెచ్‌ఎం- గ్రేడ్-2	197	177	20
స్కూల్ అసిస్టెంట్	2,673	2,483	190
ఎస్జీటీ	3,079	2,686	393
ల్యాంగ్వేజ్ పండిత్	48	29	19
పీఈటీ	16	13	3
మొత్తం	6,013	5,388	625

టీచర్ల కొరతతో పలు చోట్ల సర్దుబాటు

సంగారెడ్డి జిల్లాలో 1,247 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు 1.30 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఆటంకం కలగడంతో పాటు విద్యాశాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడటంతో పదుల సంఖ్యలో టీచర్లను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు తాత్కాలిక సర్దుబాటు చేశారు. వీరే కాకుండా జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూల్స్ సుమారు 60 వరకు ఉన్నాయి. వీటిలో పనిచేసే ఉపాధ్యాయులను కూడా సమీపంలోని పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించారు.

ఈ ఏడాదైనా భర్తీ అయ్యేనా?

మరోవైపు గత నెల జనవరి నెలలో ప్రభుత్వం టెట్ పరీక్ష నిర్వహించింది. కొత్త డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలు చేపడితే తప్పా పూర్తి స్థాయిలో టీచర్ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం లేదు.

సంగారెడ్డి పాత బస్టాండ్ సంగమేశ్వర ఆలయంలో
శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి

రంగులు, హోమం పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశం



సంగారెడ్డి పాత బస్టాండ్ సంగమేశ్వర ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 23 : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలోని పాతబస్టాండ్ వద్దగల సంగమేశ్వర దేవాలయంలో జరుగుతున్న శివరాత్రి ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆదివారం నాడు పరిశీలించారు. దేవాలయంలో మరమ్మతులు, రంగులు, హోమం పనులను పరిశీలించిన జగ్గారెడ్డి శివరాత్రి పండుగ వరకు అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జగ్గారెడ్డి వెంట మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేష్ ముదిరాజ్, సుధాకర్, గంగేరి శ్రీహరి తదితరులు ఉన్నారు.



సంగారెడ్డి పాత బస్టాండ్ సంగమేశ్వర ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జగ్గారెడ్డి



సంగారెడ్డి శివారులో ఇటుకబట్టీల వద్ద కలప దుంగలు

నర్సాపూర్ టు సంగారెడ్డి

- అడవి నుంచి కలప రవాణా
- ఇటుకబట్టీల్లో వినియోగించేందుకు తరలింపు
- అర్ధరాత్రి కాగానే కట్టెలతో బయల్దేరుతున్న వాహనాలు
- బొగ్గు, వరిపొట్టుకు బదులు కట్టెల వాడకం
- నిబంధనలకు విరుద్ధంగా ఇటుకబట్టీల దందా

ఇటుకబట్టీల నిర్వహణ ఇష్టారాజ్యంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నిబంధనలను మంటల్లో కలుపుతున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రం చుట్టుపక్కల వందకు పైగా ఇటుకబట్టీలు ఉన్నాయి. నిత్యం వందలాది లారీల ఇటుకలను తయారుచేసి తరలిస్తుంటారు. అయితే, ఇటుక తయారీలో కలపను వినియోగించడం వివాదాస్పదంగా మారుతోంది. బొగ్గు, వరిపొట్టుకు బదులుగా పచ్చని చెట్లను తెగనరికి దుంగలతో నిప్పు రాజేస్తున్నారు. నర్సాపూర్ అటవీ ప్రాంతం చుట్టుపక్కల నుంచి నిత్యం సంగారెడ్డికి పదుల సంఖ్యలో వాహనాల్లో కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇదంతా యథేచ్ఛగా జరుగుతున్నా అధికార యంత్రాంగం షరా మామూలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 23: సంగారెడ్డి మండలం హనుమాన్ నగర్, దాసుగడ్డ తండా, కులబ్‌గూరు, ఇస్మాయిల్‌ఖాన్‌పేట, కంది మండలం చిమ్నాపూర్ తండా, మామిడిపల్లి తండా, తునికిల్ల తండా, వడ్డెనగూడ తండా, ఎర్దనూరు తండా, ఆరుట్ల, ఉత్తరపల్లి, సదాశివపేట మండలం వెల్టూరు, వెంకటాపూర్, కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ తయారైన ఇటుకను సంగారెడ్డి జిల్లాతో పాటు హైదరాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, సిద్దిపేట జిల్లాలకు తరలిస్తుంటారు. నిత్యం వందలాది లారీల కలప క్రయవిక్రయాలు జరుపుతారు.

పచ్చని చెట్లు బుగ్గిపాలు

మెదక్ జిల్లా నర్సాపూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తరించిన అటవీ ప్రాంతాన్ని కొంత మంది అక్రమాలకు వినియోగిస్తున్నారు. ఉదయం సమయంలో చెట్లు కొట్టి కల్ప నిల్వ చేస్తున్నారు. రాత్రి కాగానే డీసీఎం వంటి వాహనాల్లో సర్దుబాటు చేసి సంగారెడ్డి జిల్లాలో ఉన్న ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇటుకబట్టీల వద్ద ఉన్న కలప నిల్వలే ఇందుకు సాక్ష్యం. ప్రతీ బట్టీ వద్ద పచ్చిగా ఉన్న టన్నుల కొద్దీ కట్టెలు కనిపిస్తుంటాయి. ఒక డీసీఎంలో దాదాపు 10 టన్నులకు పైగానే కలపను తరలిస్తున్నారు. అటవీ అధికారుల కళ్లుగప్పి రవాణా చేస్తున్నారా.. లేక అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల జరుగుతుందా అనే విషయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బొగ్గుకు బదులు కట్టెలు

మట్టితో తయారుచేసిన ఇటుకను బట్టీల్లో వేడి చేయడం వల్ల గట్టిదనం వస్తుంది. ఈ ఇటుకను వేడి చేయడానికి బట్టీల్లో నిప్పును రాజేయాలి. ఇందుకోసం వరిపొట్టు, బొగ్గును

మిగతా 8వ పేజీలో

బీసీ సీఎం కావాలని
ప్రజలు కోరుకుంటున్నారు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం : ఎంపీ ఈటల రాజేందర్



సదాశివపేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

సదాశివపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బీసీ ముఖ్యమంత్రి కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి బీసీలను ఓటు బ్యాంకుగానే ఉండి పోయారన్నారు. కాంగ్రెస్ సర్కారు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి అబద్దాలతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఉద్యోగులను, నిరుద్యోగులను నిండా ముంచిందన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన జీవో 317లో జరిగిన అక్రమాలను సవరిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 317 ఊసే ఎత్తడం లేదని చెప్పారు. టీచర్స్, ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటికీ ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కనీసం రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ కూడా రావడం లేదని కాంగ్రెస్ చేతకాని దద్దమ్మ ప్రభుత్వం అంటూ సీఎం పాలనపై ఈటల విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సబ్బండవర్గాల ప్రజల సంక్షేమం, బీసీ సీఎం, ఒక్క బీజేపీతో సాధ్యమవుతుందని ఎంపీ అన్నారు.



ఎలాన్ జోష్

హోరెత్తిన ఐఐటీహెచ్ ప్రాంగణం

7

దూసుకెళ్లిన
ఈ-బగ్గీలు

ఉత్కంఠభరితంగా రేసింగ్

7



చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన సిద్దిపేటలో జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణంలోని వడ్డెర కాలనీ చెందిన డీ.మధు (17) కూలీ పని చేస్తుంటాడు. ఈ మధ్యకాలంలో మధు పని చేయకపోవడంతో తన తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురై ఈనెల 5వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం మధును హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మధు మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పదంగా ఇద్దరి ఆత్మహత్య

● ఒంటికి నిప్పంటించుకుని ఘాతుకం


లక్ష్మి (ఫైల్)


శ్రీధర్ (ఫైల్)

కొండపాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఓ మహిళ, పురుషుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ అందించిన వివరాల ప్రకారం... హైదరాబాద్ నుంచి ఆటోలో ఓ మహిళ, పురుషుడు తిమ్మారెడ్డిపల్లి శివారులోని హోటళ్ల వద్ద శనివారం రాత్రి దిగారు. అనంతరం రోడ్డుకు కొంత దూరంలో పొలాల మధ్యన ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లి వారి వెంట తెచ్చుకున్న కిరోసిన్ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నారు. ఒక్కసారిగా మంటలు రావడంతో గమనించిన స్థానికులు వాటిని ఆర్పి, పోలీసులకు సమాచారం ఇచ్చి.. అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అప్పటికే మహిళ మృతి చెందింది. పురుషుడిని సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారి బ్యాగులను పరిశీలించగా వారి ఆధార్ కార్డులు లభ్యమయ్యాయి. సిద్దిపేట సాయి విద్యానగర్ కాలనీకి చెందిన శిరోద్కర్ లక్ష్మి(65), భర్త పేరు చందుగా మహిళ వివరాలు, రంగారెడ్డి జిల్లా మేడిపల్లి ఘట్‌కేసర్ గవర్నమెంట్ స్కూల్ దగ్గర ఆదర్శ నగర్‌కు చెందిన టెక్లేకర్ శ్రీధర్(44), తండ్రి నర్సోజిగా పురుషుడి వివరాలు ఉన్నాయి. వీరిని గుర్తుపట్టిన వారు తొగుట సీఐ లతీఫ్ ఫోన్ నంబరు 8712667342, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ ఫోన్ నెంబరు 8712667345లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

పెళ్లింట విషాదం

కొడుకు వివాహంలో మైలపోలు తీసి.. కుప్పకూలిన తండ్రి

తండ్రి మరణంతో ఆగిన వివాహం


సత్యనారాయణ గౌడ్ (ఫైల్)

దుబ్బాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కొడుకు వివాహంలో మైలపోలు తీసిన తండ్రి ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. ఈఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన సత్యనారాయణగౌడ్, జయ దంపతుల పెద్దకుమారుడు శ్రీనివాస్‌కు రాజన్నసిరిసిల్ల జిల్లా గంబీర్‌రావుపేట మండలం కొత్తపల్లికి చెందిన నాగపూరి మహేష్‌గౌడ్, జ్యోతి దంపతుల ఏకైక కూతురు భావనతో వివాహం నిశ్చయమైంది, ఆదివారం ఉదయం దుబ్బాకలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వివాహం జరపాలని ఏర్పాట్లు చేశారు. సిద్దిపేటలో నివాసం ఉంటున్న సత్యనారాయణ గౌడ్, తన కుమారుడి వివాహానికి అన్ని ఏర్పాట్లు చేశారు. కుమారుడిని శనివారం రాత్రి పెళ్లి కుమారుడిని చేసి, మైలపోల్ తీసి, దుబ్బాకకు పెళ్లింటికి పంపాలనుకున్నారు. అయితే మైలపోల్ తీసిన అనంతరం సత్యనారాయణగౌడ్ ఇంటిలోనే పందిరిలో ఒక్కసారిగా కుప్పకూలాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆయన మరణించినట్లుగా వైద్యులు తెలిపారు. దీంతో కుమారుడి వివాహం నిలిచిపోవడంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. అందరితో కలుపుగోలుగా ఉండే అతడు పదవీవిరమణ కూడా పొందారు. ఆయన మృతి పట్ల ఆర్టీసీ కార్మిక సంఘాలు సంతాపం తెలిపాయి.

ఎలాన్ జోష్

హోరెత్తిన ఐఐటీహెచ్ ప్రాంగణం


ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రదర్శన


ఎలాన్ ఎన్‌విజన్ ఫెస్ట్‌లో యువత కేరింతలు


ఫేస్ పెయింటింగ్ పోటీలో విద్యార్థులు

కంది, ఫిబ్రవరి 23 : ఎథికల్ హ్యాకింగ్ అండ్ సైబర్ క్రైం, డీప్ లెర్నింగ్ వంటి సాంకేతిక వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు.. షుగర్ రాకెట్రీ, డ్రోన్ ఛాలెంజ్ వంటి వింతైన పోటీలు.. వాటర్ గేమింగ్, రోబోటిక్స్, మూవీ మేకింగ్, ఎలక్ట్రిక్, ఆర్ట్ ఎగ్జిబిషన్... రేడియో ఈవెంట్స్ హంట్, ర్యాంప్ వాక్, బాటిల్ ఆఫ్ బాండ్స్ వంటి షోలతో ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణం హోరెత్తింది. నృత్యాంజలి, క్లాసికల్ పెర్ఫామెన్స్, సంగీత కచేరీలతో మొదలై.. సంస్కృతి, సాంకేతికల ఆవిష్కరణలతో పాటు రాక్‌బ్యాండ్, మ్యూజిక్ స్టేజ్‌లు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. దేశ నలుమూలల నుంచి వివిధ ఇంజనీరింగ్ కళాశాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఎలాన్-ఎన్‌విజన్ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. సాంస్కృతిక, సాంకేతికతో కూడిన ఈవెంట్లు అందరినీ అలరించాయి. విజేతలు రూ.6 లక్షల విలువైన బహుమతులు గెలుచుకున్నారు. చివరి రోజు స్వస్తిక్ బ్యాండ్ ప్రదర్శన, ఐఐటీహెచ్ విద్యార్థుల మ్యూజిక్‌తో యువతలో జోష్ నెలకొన్నది. రేడియోమిర్చి సింగర్ అమృత సందడి చేశారు. ఎలాన్, ఎన్‌విజన్ విజయవంతానికి విద్యార్థి కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేశాయని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా కొత్తగా వస్తున్న సాంకేతిక మార్పులపై దృష్టి కేంద్రీకరించి మేధస్సును పెంపొందించుకుంటూ కొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలన్నారు. రేడియోమిర్చి సింగర్ అమృత మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్‌లో చదువుకోవాలని ఆశగా ఉండేదని, కానీ తనకు అదృష్టం దక్కలేదన్నారు. విద్యార్థులు ప్రపంచస్థాయిలో సాంకేతిక పరిశోధనలు జరిపి దేశ పురోగతికి బాటలు వేయాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.


ర్యాంప్‌వాక్ చేస్తున్న విద్యార్థి

బ్రేక్ డ్యాన్స్ పోటీలో విద్యార్థిని

దూసుకెళ్లిన ఈ-బగ్గీలు

ఉత్కంఠభరితంగా రేసింగ్

నర్సాపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాళ్లురప్పలు, ఎత్తైన దారి, కంకర, బురద, నీళ్ల మార్గంలో ఈ - బగ్గీలు రయ్‌మంటూ దూసుకెళ్లాయి. నాలుగు గంటల పాటు తాము రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను నడిపి విద్యార్థులు సత్తా చాటారు. మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీలో 'ఈ-బాజా సే ఇండియా' పేరిట మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయస్థాయి స్థాయి ఎలక్ట్రిక్ వాహనాల రేస్ ఆదివారంతో ముగిసింది. రెండు రోజుల పాటు 19 రాష్ట్రాల నుంచి వచ్చిన 77 జట్లు రూపొందించిన ఈ-బగ్గీలకు వివిధ సాంకేతిక, ట్రయల్ రన్ టెస్టులను నిర్వహించగా, 51 జట్లు చివరి దశకు చేరుకున్నాయి. అందులో చివరగా 44 టీంలు ఆదివారం నిర్వహించిన ఫైనల్ రేసులో నిలిచాయి. విద్యార్థులు తయారు చేసిన ఎలక్ట్రిక్ వాహనం అన్ని రోడ్లను తట్టుకునేలా ఉందా అని పరీక్షించేందుకు బీవీఆర్‌ఐటీ కాలేజీ సమీపంలోని చెరువు వద్ద కఠినతరమైన ట్రాక్‌ను నాల్గు కిలోమీటర్ల మేర ప్రత్యేకంగా రూపొందించారు. స్పెషల్ ట్రాక్‌పై ఈ-బగ్గీల ఫైనల్ రేసింగ్ నాలుగు గంటల పాటు ఉత్కంఠభరితంగా కొనసాగింది. విజయవంతంగా నడిపిన విద్యార్థుల జట్టు ట్రోఫీని గెలుచుకున్నాయి. మహిళ విభాగంలో భీమవరం విష్ణు మహిళ కాలేజీ మొదటి బహుమతిని గెలుచుకున్నది. అన్ని విభాగాలలో అక్రుదికి చెందిన పాటిల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ బృందం విజేతగా నిలిచింది. ఈ రెండు టీంలకు రూ.లక్ష ప్రోత్సాహక బహుమతి, ట్రోఫీని అందజేశారు. రెండో బహుమతి పూణెకు చెందిన ఎంఐటీ యూనివర్సిటీకి దక్కగా, రూ.75వేలు, మూడో బహుమతి పింపిరికి చెందిన చించ్‌వడ్ ఇంజనీరింగ్ కాలేజీ గెలుచుకోగా రూ.50 వేల నగదు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, గౌరవ అతిథిగా హాజరైన బీపీసీఎల్ సుఖ్‌మాల్‌జైన్ అందజేశారు.


మహిళ విభాగంలో మొదటి బహుమతిని అందుకున్న భీమవరం విష్ణు మహిళ కాలేజీ జట్టు


కఠినమైన ఎత్తుగా ఉన్న ట్రాక్‌పై ఈ-బగ్గీతో దూసుకెళుతున్న విద్యార్థి

'కేతకీ'కి బ్రహ్మోత్సవ శోభ

సంగమేశ్వర ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం

మార్చి 3 వరకు కొనసాగనున్న జాతర

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



ఝరాసంగం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆదివారం శిఖర పూజతో వైభవంగా ప్రారంభమయ్యాయి. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు తెలంగాణ ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో స్నానపు గదులు, మరుగుదొడ్ల, తాగునీటి వసతులు, పరిసరాల పరిశుభ్రత, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, స్థానిక ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు.

జహీరాబాద్ నుంచి ఆర్టీసీ స్పెషల్ బస్సులు

జహీరాబాద్ పట్టణానికి 16 కిలోమీటర్ల దూరంలో కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయం ఉంది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ నుంచి జహీరాబాద్‌కు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయి. జహీరాబాద్ నుంచి ఆర్టీసీ అధికారులు ఝరాసంగంకు జాతర స్పెషల్ బస్సులను నడుపుతారు. అందులో నేరుగా శ్రీకేతకీ సంగమేశ్వర ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకోవచ్చు.

పూజ కార్యక్రమాలు

24న స్వామి వారికి రుద్రాభిషేకం, రాత్రి పల్లకీ సేవ, 25న సాయంత్రం శేష వాహన సేవ, రాత్రి పల్లకీ సేవ, 26న మహాశివరాత్రి పర్వదినాన లింగోద్భవ సమయన మహాన్యస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, 27న నందివాహనసేవ, అగ్నిగుండం, 28న పార్వతీ పరమేశ్వర్ల కల్యాణం, రాత్రి విమానరథోత్సం, మార్చి1న పల్లకీ సేవ, అమ్మవారికీ కుంకుమార్చన, 2న పల్లకీ సేవ, 3న లక్ష బిల్వార్చన కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఘనంగా శిఖర పూజ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో శిఖర పూజను ఆలయ అర్చకులు వేదా మంత్రోచ్చారణల మధ్య ఘనంగా చేపట్టారు. మొదట ఆలయానికి సమీపంలోని పుట్టకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమంతో పాటు స్వామి వారికి అభిషేక కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శివరుద్రప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంత్‌రావు పాటిల్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


శిఖర పూజ నిర్వహిస్తున్న అర్చకులు



వనదుర్గమ్మ.. వస్తున్నాం


ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

శివరాత్రి నుంచి ఏడుపాయల మహాజాతర



తూతూమంత్రంగా ఏర్పాట్లు.. పాత వాటికే పూతలు

తాత్కాలిక పనులతోనే సరి

జాతర నిర్వహణకు విడుదల కాని నిధులు

పాపన్నపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జానపదుల సంస్కృతికి అద్దం పట్టే ఏడుపాయల మహాజాతర రెండు రోజుల్లో ప్రారంభం కానున్నది. రాష్ట్రంలో సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత రెండో అతిపెద్ద పండుగగా ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వనదుర్గమ్మ జాతరకు పేరుంది. సుమారు పది లక్షల మంది వస్తారని అంచనా. ప్రతి ఏటా మహాశివరాత్రి నాటి నుంచి ఏడుపాయల వనదుర్గమ్మ సన్నిధిలో మూడు రోజులపాటు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ జాతరకు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు హైదరాబాద్ నగరవాసులు, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తండోపతండాలుగా తరలిరానున్నారు. ఆలయంలో మూడు రోజుల పాటు విశేష పూజ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. శివరాత్రి పర్వదినాన ఉపవాస దీక్షలు, జాగరణ, తర్వాతి రోజు బండ్ల ఊరేగింపు, చివరి రోజున రథోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మూడు రోజులే కాకుండా వారం పాటు భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటుంటారు.

మారని ఆలయ రూపురేఖలు

పాలకులు మారినా దేవాలయాల రూపురేఖలు మాత్రం మారడం లేదు. ప్రతి ఏటా సుమారు భక్తుల మొక్కుల రూపంలోనే రూ.10 కోట్ల మేరా ఆదాయం సమకూరుతున్నది. టెండర్ల ద్వారా ఆదాయం కోట్లల్లోనే వస్తున్నది. కానీ ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం కనీస సౌకర్యాలు కల్పించక పోగా ప్రత్యేక నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. క్షేత్రంలో ఏళ్లుగా మొక్కుల రూపేణ భక్తులు కట్టించిన సుమారు 60 విడిది గృహాలే తప్ప దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా ఒక్కటీ లేదు. భక్తులు నిర్మించిన విడిది గృహాలతోనూ అద్దె రూపంలో ప్రతీ నెల లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. అయిన వాటి నిర్వహణ మాత్రం అంతంత మాత్రమే.

పాత వాటికే పూతలు

జాతర ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. భక్తుల కోసం శాశ్వత పనులు చేపట్టాల్సిన అధికారులు 2016లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లకు రంగులు వేశారు. స్నానాల వద్ద కట్టెలను కట్టి, ఆలయం చుట్టూ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేసి నామమాత్రపు పనులతో చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఏడుపాయలకు ఘనమైన చరిత్ర ఉన్నప్పటికీ, ఎన్నేళ్లు గడిచినా భక్తుల సౌకర్యార్థం శాశ్వత పనులను చేపట్టడంలో మాత్రం విఫలమౌతున్నారు. పనుల పేర లక్షల్లో బిల్లులు సమర్పించి ఉన్నకాడికి దండుకుంటున్నారన్న అపవాదులు ఉన్నాయి. శాశ్వత పనులు చేపట్టకపోవడంతో భక్తులకు ఇక్కట్లు తప్పడం లేవన్న విమర్శలు ఉన్నాయి. ప్రతీ ఏటా జాతర ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తూ ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. గతంలో జాతర కన్న నెల రోజుల ముందే ప్రత్యేక నిధులు మంజూరు చేసేవారు. కానీ, ఈసారి పాలకుల నిర్లక్ష్యమా.. అధికారుల వైఫల్యమా జాతర నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం పాలకమండలిని ఏర్పాటు చేయకపోవడం ఈ నిర్లక్ష్యానికి ప్రధాన కారణం. అయితే, ఉత్సవ కమిటీ ఊసు కూడా ఎత్తడం లేదు. అనుభవలేమితో ఈవో చంద్రశేఖర్ ఇష్టారీతిన ఏర్పాట్లను చేయిస్తున్నారు. సిబ్బంది కల్పించుకొని చెప్పిన వినడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే నేటివరకు ఏడుపాయల ఏర్పాట్లను పర్యవేక్షించక పోవడం విస్మయానికి గురి చేస్తుంది. ఈవో, ఎమ్మెల్యే మధ్య సయోధ్య కుదరకనే నిధులు మంజూరుకు ఆలస్యం అవుతున్నదని భక్తులు మండిపడుతున్నారు.


తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మూత్రశాలలు

పాతాళానికి గంగమ్మ


అడుగంటుతున్న భూగర్భ జలాలు

పంటలను కాపాడుకునేందుకు మెట్ట రైతుల భగీరథ యత్నం

బావుల్లో పూడికతీతలు.. బోర్లు వేయిస్తున్న వైనం

15 రోజుల్లోనే వందలాది బోర్లు వేసిన రైతులు


అక్కన్నపేట మండలం జనగామలో బావిలో క్రేన్‌తో తీస్తున్న పూడిక


జనగామలో బావిలో అడుగంటిన నీరు

రామవరంలో ఎండిన వరి పంట

హుస్నాబాద్/అక్కన్నపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పొంగిన జలధారలతో ఇక వ్యవసాయానికి ఢోకా లేదని భూమినంతా సాగు చేశారు. కానీ వారి ఆశలు అడియాసలవుతున్నాయి. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతుండటంతో బావులు, బోర్లు అడుగంటుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు మెట్ట రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం బోర్లు వేస్తున్నారు. బావుల్లో పూడికతీయిస్తున్నారు.

పంటను కాపాడుకునే ప్రయత్నం

హుస్నాబాద్ డివిజన్‌లో గతం కంటే ఎక్కువ వరి సాగు చేశారు. 15 రోజుల నుంచి భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. దీంతో పంటలు ఎండి పోయే దశకు వస్తున్నాయి. గత్యంతరం లేక ఒకటీ, రెండు మడులకు నీరు పెట్టడం ఆపి మిగతా మడులకు పారిస్తున్నారు. అయితే, కొందరు రైతులు ఉన్న పంటలను కాపాడుకోవడానికి బోర్లు వేస్తున్నారు. ఆరు నుంచి ఏడు వందల ఫీట్ల లోతు వరకు బోర్లు వేస్తున్నారు. 15 రోజుల వ్యవధిలోనే నీరు రాక రెండు నుంచి మూడు వరకు బోర్లు వేసిన రైతులు ఉన్నారు. ఓ రైతు బోరు వేస్తే సక్సెస్ కాగానే దాని పక్క మరో రైతు వేస్తున్నాడు. ఒక బోర్‌లో నీళ్ల రాకున్నా.. రెండో దానిలో రాకపోతాయా.. అనే ఆశతో కొందరు రైతులు బోర్లు వేస్తూ ఉన్నారు. అడుగంటిన వ్యవసాయబావులను వేల రూపాయలు వెచ్చించి క్రేన్లతో పూడిక తీయిస్తున్నారు. ఒక బావి పూడిక తీయడానికి రూ.25వేలు గంపగుత్తగా తీసుకుంటున్నారు. అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన బోనాల శ్రీనివాస్ అనే రైతు తనకున్న మూడు ఎకరాల మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు 10 రోజుల క్రితం ఒకటే రోజు మూడు బోర్లు వేసిన ఫలితం లేకుండా పోయింది. ఇదే గ్రామానికి చెందిన మోటె రాజయ్య మొన్నటి వరకు కొత్తగా తవ్వినా బావి ఉన్న రెండు ఎకరాల వరి పంటకు నీరందించింది. ప్రస్తుతం ఎండిపోతుండంతో క్రేను పెట్టి పూడిక తీయిస్తున్నాడు. ఇలా డివిజన్‌లోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట్, బెజ్జంకి మండలాల్లో 15 రోజుల వ్యవధిలో క్రేన్లు, బోర్లు జోరుగా నడుస్తున్నాయి.

రెండు నెలల్లో ఆరు బోర్లు వేసిన

నాకు ఎనిమిది ఎకరాల వరకు భూమి ఉంది. ఏడు ఎకరాల్లో మామిడి తోట, ఒక ఎకరంలో వరి పంట వేసిన గతేడాది మూడు బోర్లు వేశాను. ఈ బోర్లు డిసెంబరు నుంచే ఎత్తిపోయాయి. దీంతో తోటను, వరిని కాపాడుకునేందుకు డిసెంబరు 9వ తేదీ నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఆరు బోర్లు వేసిన. అందులో రెండు బోర్లలో చిన్నగా నీటి ధార వస్తుంది. మిగతా నాలుగు బోర్ల నుంచి చుక్క నీరు రాలేదు. వచ్చే నీటితో తోటను కాపాడు కుంటున్నా. వరి ఎండి పోయింది. బోర్ల కోసం రూ.9 లక్షల వరకు ఖర్చు పెట్టిన.

- కంకనాల సదాశివరెడ్డి, జనగామ, అక్కన్నపేట మండలం

చుక్క నీరు పడలే

ఈ పది రోజుల్లో నాలుగు బోర్లు వేశాను. చుక్క నీరు పడలే. బోర్లు వేసేందుకు రూ.2 లక్షలు ఖర్చు చేశాను. పంటలు సాగు చేయడానికి మరో రూ.లక్ష అప్పు చేశాను. సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అని ఆలోచిస్తే భయమేస్తుంది.

- పొన్న కరుణాకర్, రామవరం, అక్కన్నపేట మండలం


అక్కన్నపేట మండలం మల్లంపల్లిలో వేస్తున్న బోరు


అక్కన్నపేట మండలం రామవరంలో బోరు వేసిన పడని చుక్క నీరు

సిండికేటుగా మారిన బోర్‌వెల్ ఏజెంట్లు

బోర్లు వేయడానికి రైతన్నలు ఆసక్తి కనబరుస్తుండడంతో బోర్‌వెల్ ఏజెంట్లు సిండికేటుగా మారి అధిక ధరలు పెంచి రైతులను దోపిడీ చేస్తున్నారు. 100 ఫీట్ల వరకు ఫీటుకు రూ.85 - 95, 100 ఫీట్ల నుంచి 200 ఫీట్ల వరకు రూ. 110 - 120 ఇలా ఫీట్ల లోతు పెరిగే కొద్దీ ధరలు పెంచుతున్నారు. కేసింగ్, జాలి కేసింగ్ పైపు వేయాలని ఫీటుకు రూ.400 నుంచి రూ.600 వరకు వసూలు చేస్తున్నారు. ఇవే కాక అదనంగా కూడా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ముక్కు పిండీ వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 500 నుంచి 600 ఫీట్ల వరకు బోరు వేయాలంటే రూ.1.20 లక్షల వరకు ఖర్చు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇరుకు రోడ్లు.. తరచూ ప్రమాదాలు

- మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు కరువు
- ప్రజలు మృత్యువాత పడుతున్నా.. పట్టించుకోని అధికారులు



కాసాల సమీపంలో సూచిక బోర్డు లేకుండా ఉన్న మూలమలుపు

హత్నూర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు ఇరుకుగా ఉండడం వల్ల వాహనాల రాకపోకలు పెరిగి ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడుతున్నారు. హత్నూర మండలంలోని దౌల్తాబాద్ నుంచి రెడ్డిఖానాపూర్ మీదుగా బోర్పట్ల వరకు 25 ఏళ్ల క్రితం అప్పటి జనాబా దృష్ట్యా సుమారు 5 కిలోమీటర్ల మేర ఒక వరుస తారురోడ్డు వేశారు. కాలక్రమేణా వాహనాలు పెరిగాయి. కానీ రోడ్డు ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుపై ట్రాక్టర్లు ఢీకొని ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. రెండేళ్లలో కేవలం కాసాల ఒక్క గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు మృతిచెందారు. అంతేకాకుండా మూలమలుపుల వద్ద ప్రమాద సూచికలు, వేగ నియంత్రణకు తగు చర్యలు తీసుకోకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా చెప్పొచ్చు. దౌల్తాబాద్ నుంచి సికింద్లాపూర్ మీదుగా నాగుల్‌దేవులపల్లి, గిరిజన తండాలకు వెళ్లే రోడ్డు కూడా ఒకే లైన్ ఉండడంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డును రెండు లైన్ల రోడ్డుగా మార్చడంతో పాటు సైడ్ బర్మ్స్ ఏర్పాటు చేసి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకుపోయాం



దౌల్తాబాద్ నుంచి సికింద్రాపూర్ మీదుగా నాగుల్ దేవులపల్లి వరకు ఉన్న ఒక లైను రోడ్డును విస్తరించి రెండు లైన్లుగా మార్చాలని ఇదివరకే అధికారుల దృష్టికి తీసుకుపోయాం. ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రెండు లైన్ల రోడ్డుగా విస్తరించే విధంగా ప్రయత్నం చేస్తాం.

- బావికాడి సుధాకర్, మాజీ సర్పంచ్, నాగుల్‌దేవులపల్లి

ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం



ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నాం. ఇరుకైన రోడ్డుపై భారీ వాహనాలతో ఏ క్షణంలో ప్రమాదం పొంచి ఉందో అర్థం కావడం లేదు. ద్విచక్ర వాహనాలను ఎదురుగా వచ్చే భారీ వాహనాలు ఢీకొట్టిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా రోడ్డును విస్తరించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి.

- మల్లేశం, బోర్పట్ల

1.08 కోటి రుద్రాక్ష శివలింగం ఆవిష్కరణ

- హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో పూజలు నిర్వహిస్తున్న ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో 1.08 కోటి రుద్రాక్షలతో రూపొందించిన రుద్రాక్ష శివలింగాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కోటి రుద్రాక్ష శివలింగం ఆవిష్కరణ సందర్భంగా సరస్వతీదేవి అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలోని పురవీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు. ఈ మహోత్సవానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటి రుద్రాక్ష మహోత్సవం విశేషాలను ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి తదితరులు పాల్గొన్నారు.

అన్నిమతాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నాం

- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఉత్తర భారతీయులు నిర్వహించిన సరస్వతీదేవి పూజకు హాజరైన మహిపాల్‌రెడ్డి

ఐడీఏబొల్లారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని అన్ని ప్రాంతాల వారి మనోభావాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఐడీఏబొల్లారం పట్టణ పరిధి బతుకమ్మఘాట్ వద్ద ఉత్తర భారతీయులు సరస్వతీదేవి పూజలు నిర్వహించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మాట్లాడారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చేటట్టు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఐడీఏబొల్లారం పట్టణాన్ని మినీభారతంగా పిలుస్తారని వివరించారు. అన్ని రాష్ట్రాలకు చెందిన వారి సంప్రదాయాలను గౌరవిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, హనుమంతరెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, సతీష్, బీరప్ప, రత్నం, పుండరీకం తదితరులు పాల్గొన్నారు.

అందరూ కలిసిమెలిసి ఉండాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అందరం కలిసిమెలిసి ఉండాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మూసానగర్‌లో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో మజీద్ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మతసామరస్యాన్ని కాపాడేందుకు కృషి చేయాలన్నారు.

సేవాదృక్పథం అలవర్చుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి

రామాయంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆవాస విద్యాలయ 19వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా అఖిల భారతీయ సంఘటన కార్యదర్శి కొండూరి విద్యాన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారంతో ఇక్కడ ఆవాసం నడపటం గొప్ప విషయమన్నారు. నిరుపేద, అనాథ బాలలను చేరదీసి విద్య, వసతి కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పడకంటి సంగమేశ్వర్, ఏలూరు రవి, లక్ష్మణ్ యాదవ్ పండరీనాథ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆవాస విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.

విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

- సైన్స్ అండ్ హ్యూమనిటీశాఖ ప్రొఫెసర్ రాధికాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రాధికాదేవి

జహీరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సైన్స్ అండ్ హ్యూమనిటీశాఖ ప్రొఫెసర్ రాధికాదేవి పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో శ్రామిక విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సైన్స్ ప్రాజెక్టు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై సృజనాత్మక ప్రయోగాలను తయారుచేసి ప్రదర్శనార్థం తీసుకువచ్చిన విద్యార్థులను అభినందించారు. ఇందులో 22 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 52 ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం ప్రతిభచూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామికవిజ్ఞాన్ కేంద్రం ట్రస్టీ డా.విజయలక్ష్మి, కార్యదర్శి డా.శివబాబు, ప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో బీజేపీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్‌లో బీజేపీ నియోజకవర్గ ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకుడు మురళీధర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను గ్రామగ్రామాన తీసుకెళ్తూ.. మోదీ పాలనలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీటీయూ ఉపాధ్యాయులకు ఓటుహక్కు కల్పించాలి

- వ్యవస్థాపక అధ్యక్షుడు మధుసూదనరావు

జహీరాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో ఎస్టీటీయూలకు ఓటు హక్కు కల్పించాలని ఎస్టీటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకినేని మధుసూదనరావు పేర్కొన్నారు. ఎస్టీటీయూ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు విద్య అందుబాటులో ఉండాలన్నారు. ఎమ్మెల్సీ వ్యవస్థ కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుందని, మంచి సమాజం కోసం అందరి కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీటీయూ నాయకులు ప్రభాకర్, కాశీనాథ్, కిష్టయ్య, మైపాల్‌రెడ్డి, డా.శివశేఖర్, యూసూఫ్ పాల్గొన్నారు.

'కార్మికులు మెరుగైన సేవలందించాలి'

నారాయణఖేడ్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కార్మికులు బస్సులకు తామే యజమానులుగా భావించి, మెరుగైన సేవలందించాలని డీఎం మల్లేశయ్య అన్నారు. ఆదివారం డిపో ఆవరణలో ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు కార్మికులకు పవర్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా తరగతులు వారంరోజుల పాటు కొనసాగుతాయని, ప్రతిరోజు 35 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీర్ దశరత్‌రావు, అసిస్టెంట్ డీఎం నర్సింహులు, టీఐత్రీ నందులాల్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి శిఖర ప్రతిష్ఠాపన

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పురపాలక పట్టణ పరిధి శ్రీరామ్‌నగర్ కాలనీలో లక్ష్మీనరసింహస్వామి, బసవలింగేశ్వరస్వామి శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు స్వామివారిని దర్శించుకునే అవకాశం కల్పించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, బీరప్పయాదవ్, సతీష్, శ్రీకాంత్ యాదవ్, శైలజాపుండరీకం, మాజీ ఎంపీటీసీ రత్నం, విజయారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సాయి, శారద తదితరులు ఉన్నారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

రాయికోడ్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సింగితం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం గ్రామంలో మహిళలు బోనాలు తీశారు. ఊ రేగింపులో జోగిని శ్యామల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. బర్దీపూర్ అవధూతగిరి మహరాజ్, ధనాసిరి శివాచారి హిరేమట్, మల్లన్నగట్టు బసవలింగ అవధూతగిరి మహరాజ్, డాక్టర్ మటన్ రాజ్‌స్వామి, రంజాన్ పీఠాధిపతులచే ప్రవచనాలు నిర్వహించారు.

'బాలాజీ'లో మొట్టమొదటి 'పేస్ మేకర్ ఆపరేషన్'

- సర్జరీ విజయవంతంగా నిర్వహించిన కార్డియాలజీ బృందం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హాస్పిటల్ ఎండీ డా.శ్రీధర్, డాక్టర్లు, (చిత్రంలో పేషెంట్ పెంటయ్య)

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి శివారులోని బాలాజీ హాస్పిటల్‌లో మొట్టమొదటి పేస్ మేకర్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన పెంటయ్య తీవ్ర ఛాతి నొప్పి, ఆయాసం, దమ్ముతో బాధపడుతూ 13న బాలాజీ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. హాస్పిటల్‌లోని ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్ట్ డా.మహేశ్ అన్నిరకాల వైద్య పరీక్షలతో పాటు యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. యాంజియోగ్రామ్‌లో పెంటయ్య గుండెలో రెండు కీలక రక్తనాళాల్లో రక్త సరఫరా 90 శాతం నిలిచిపోయిందని, దాని ద్వారా గుండె నిమిషానికి 40 సార్లు మాత్రమే కొట్టుకుంటుందని నిర్ధారించారు. పెంటయ్యకు వెంటనే స్టంట్ వేసుకోవాలని సూచించిన డాక్టర్లు.. ఆరోగ్యశ్రీ కింద గుండెకు సక్రమంగా రక్త ప్రసరణ జరిగేలా పర్మినెంట్ పేస్ మేకర్‌ను ఆయన ఛాతిలో అమర్చారు. సర్జరీ అనంతరం పెంటయ్య గుండె హార్ట్ రేటు నిమిషానికి 82 సార్లు కొట్టుకునేలా కృషి చేశారు. ప్రస్తుతం పెంటయ్య కోలుకొని డిశ్చార్జ్ అయినట్టు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శ్రీధర్, ఇంటర్వేన్షనల్ కార్డియాలజిస్ట్ డా.మహేశ్, కార్డియాలజిస్ట్ డా.వేణుగోపాల్, అనస్తీషియా డా.శంకర్‌నారాయణ, అత్యవసర విభాగం హెచ్‌వోడీ డా.అక్బర్‌సయ్యద్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

'ప్రజావాణి' రద్దు: కలెక్టర్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున అందుబాటులో ఉండరని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బందులు పడవద్దని సూచించారు. తిరిగి ప్రజావాణి ఎప్పుడు నిర్వహించే విషయాన్ని పత్రికల ద్వారా తెలియజేస్తామన్నారు.

వివాహ బంధాలపై అవగాహన

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వివాహ బంధాలు, కుటుంబ వ్యవస్థ గురించి సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి 800 మంది బ్రాహ్మణ వధూవరులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

'బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి'

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని టీడీపీ మెదక్ పార్లమెంట్ ఇల్లేందు రమేష్ అన్నారు. సంగారెడ్డిలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడుపై బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్ష

నర్సాపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): డంపుయార్డుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలేదీక్షలు ఏడవరోజు కూడా నర్సాపూర్‌లో కొనసాగుతున్నాయి. ఆదివారం పట్టణంలోని ఎనిమిదవ వార్డుకు చెందిన పలువురు రైతులు, నాయకులు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

అట్టహాసంగా అఖండ హరినామ సప్తాహ

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఏనక్‌పల్లి గ్రామంలో ఆదివారం అట్టహాసంగా అఖండ హరినామ సప్తాహ భజన మండలి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పండరీపూర్ బీందాస్ మహరాజ్ స్మారకంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, డీలర్ విఠల్‌సాగర్, పండరిరెడ్డి, పండరిపాటిల్ పాల్గొన్నారు.

ఖేడ్ డిపోకు 9 కొత్త బస్సులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోకు 9 కొత్త బస్సులు వచ్చాయి. డిపోలో బస్సుల కొరత ఉండడంతో, ఇటీవల ఎమ్మెల్యే సంజీవరెడ్డి డిపోకు 25 కొత్త బస్సులు కేటాయించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు డిపోకు 9 బస్సులు వచ్చాయి. వాటిలో 6 ఎక్స్‌ప్రెస్‌లు కాగా, మూడు పల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. డిపోకు ఒకేసారి 9 బస్సులు రావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధం

శివ్వంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధమై భూమి పత్రాలు, నగదు, బంగారం కాలిపోయిన ఘటన ఆదివారం లింగోజిగూడలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని లింగోజిగూడకు చెందిన ఎర్రోళ్ల ప్రభాకర్ కుటుంబం పూరి గుడిసెలో నివసిస్తున్నారు. రెండురోజుల క్రితం ఆస్పత్రికి వెళ్లగా.. శనివారం అర్ధరాత్రి గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పంటుకున్నది. దీంతో గుడిసెలో ఉన్న భూమి పత్రాలు, నగదు, బంగారంతో పాటు, ఇతర వస్తువులు కాలిబూడిదయ్యాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

గుండెపోటుతో మున్సిపల్ కార్మికుడు మృతి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న కార్మికుడు గుండెపోటుతో మృతిచెందాడు. పట్టణానికి చెందిన గంటని కిరణ్(33) మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ కార్మికుడిగా ఆటో నడుపుతూ విధులు నిర్వహిస్తుంటాడు. రోజు మాదిరిగా ఆదివారం ఉదయం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన అతను ఆరోగ్యం బాగా లేదని చెప్పి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో పడుకొని ఉండగా భార్యవచ్చి పిలిచింది. వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి శానిటరీ అధికారి నాగరాజు, శ్రీనివాస్ అంత్యక్రియలకు రూ.20 వేలను అందజేశారు.

నర్సాపూర్ టు సంగారెడ్డి

5వ పేజీ తరువాయి

వినియోగించాల్సి ఉంటుంది. బొగ్గు కొనుగోలుకు లైసెన్సు కూడా ఉండాలి. అయితే బొగ్గు టన్నుకు రూ.10వేల పైగానే ఉండడంతో ఇటుక బట్టీల వ్యాపారుల దృష్టి కట్టెలపై పడింది. బొగ్గుకు వెచ్చించే డబ్బులో సగం ఖర్చు చేస్తే లభిస్తున్నాయి. సమయానికి అక్రమంగా రవాణా చేయడానికి దళారులు తయారుగా ఉన్నారు. దీంతో, ఇటుకబట్టీల్లో యథేచ్ఛగా కలపను వాడుతున్నారు. తమ వ్యాపార నిర్వహణ కోసం పచ్చని చెట్లను హరిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం కొసమెరుపు.

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి

- కాంగ్రెస్ నాయకుడు పులిమామిడిరాజు



కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పులిమామిడిరాజు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి అని కాంగ్రెస్ నాయకుడు పులిమామిడి రాజు అన్నారు. సంగారెడ్డి పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎస్‌బీఆర్ కప్ సెకండ్ ఓపెన్ నేషనల్ కుంఫు, కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజు ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్లు అలి, శంకర్, పోచయ్య, సాజిద్, చందర్, కన్నాగౌడ్, రమేశ్, పీఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన రజతోత్సవ వేడుకలు



ముగింపు వేడుకల్లో పాఠశాల యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ 25 వసంతాల రజతోత్సవ ముగింపు వేడుకలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. ముఖ్యఅతిథులుగా కృష్ణ భాగవతుల, సుదీర్‌ఖాన్ హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఇందులో భాగంగా 'శోధించు సాధించు' అనే అంశంపై చక్కటి సందేశాత్మక స్కిట్ చేసి విద్యార్థులు తమ జీవితంలో ఎలా ఉదగాలో కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థ అధినేత పాపులమ్మ సలోమోన్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, హెచ్‌ఎం అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ జయబాలరెడ్డి, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులపై మత్స్యకారులదే హక్కు

నిజాంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం చెరువులపై పూర్తి హక్కు మత్స్యకారులకు ఉన్నదని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటేష్‌ముదిరాజ్ పేర్కొన్నారు. చేపలు పట్టే వారిపై చర్యలు తీసుకోవాలని బచ్చురాజ్‌పల్లి మత్స్యకారుల ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల ఆధీనంలో ఉన్న చెరువుల్లో వలలు వేసి జడ్‌చెరువు తండా గిరిజనులు మత్స్యసంపదను దోచుకెళ్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని, మత్స్యకారులకు పూర్తి అధికారం ఇవ్వాలని కోరారు.

ఆదివారం సైతం పన్ను వసూళ్లు

- విధుల్లో వార్డు అధికారులు, రెవెన్యూ సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సంవత్సరం దగ్గరపడుతుండటంతో పన్ను వసూళ్లపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. జిల్లా కేంద్రమైన మెదక్ మున్సిపల్ పరిధిలో 12,114 వాణిజ్య, నివాస భవనాలు ఉన్నాయి. వీటి ద్వారా రూ.5.46 కోట్ల పన్నుల రూపేణ వసూలు కావాల్సి ఉంది. ఈ సంవత్సరం పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేసేందుకు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి వార్డు అధికారులు కూడా రెవెన్యూ సిబ్బందితో ఇంటింటికి వెళ్లాలని ఆదేశించారు. అదేవిధంగా ఆదివారం సెలవుదినం అయినా పన్ను వసూళ్ల చేపట్టాల్సిందేనని చెప్పడంతో ఆర్ఐ జానయ్య వార్డు అధికారులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేశారు.

ముగిసిన టెన్నిస్, త్రోబాల్ పోటీలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్(తెన) ఆధ్వర్యంలో రెండునెలలుగా కొనసాగుతున్న క్రీడల్లో భాగంగా నిర్వహించిన టెన్నిస్, త్రోబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. మహిళల త్రోబాల్ పోటీల్లో విజన్ ఇన్‌ఫినిటీ విల్లాస్ జట్టు విజేతగా నిలువగా, మే ఫేర్ అపార్ట్‌మెంట్ జట్టు రన్నర్‌గా గెలుపొందింది. టెన్నిస్‌లో అపర్ణ జెన్నీత్‌కు చెందిన కరణ్ విజేతగా నిలువగా... అస్త్రా గ్రీన్ హోమ్స్ అపార్ట్‌మెంట్స్‌కు చెందిన జయ్ రన్నర్‌గా నిలిచాడు. పోటీల్లో గెలుపొందిన వారికి రేసింగ్ ఏహెడ్ సంస్థ జ్ఞాపికలు అందజేసినట్టు తెన అధ్యక్షుడు, నిర్వాహకుడు ఈశ్వరగారి రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టెన్నిస్ కన్వీనర్ రాంకుమార్, త్రోబాల్ కన్వీనర్ తాన్య, నిర్వాహకులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని చేపల మార్కెట్ వద్ద రద్దీగా జనం

ఇక్కడిలా.. అక్కడలా..!

బర్డ్‌ఫ్లూ భయం పక్క రాష్ట్రం నుంచి తెలంగాణకు పాకింది. తెలంగాణలో ఒక్క బర్డ్‌ఫ్లూ కేసు నమోదు కావడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఆదివారం వచ్చిందంటే చాలు చికెన్ సెంటర్ల వద్ద బారులుతీరే జనం.. ప్రస్తుతం చేపల మార్కెట్‌కు క్యూ కడుతున్నారు. దీంతో గిరాకీ లేక దిగాలుగా కూర్చునే పరిస్థితి వచ్చిందని చికెన్ సెంటర్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్



చికెన్ షాపులో కస్టమర్లు లేక దిగాలుగా కూర్చున్న వ్యాపారి